క్లుప్తంగా

కొనసాగుతున్న అయ్యప్ప మండల పూజలు

నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప మండల పూజలు సోమవారం కొనసాగాయి. ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్ గుప్తా ఆధ్వర్యంలో అర్చకుడు దేవేశ్ మిశ్రా ప్రత్యేక పూజలు నిర్వహించారు. చకిలం కృష్ణమూర్తి శారద, బాదం విజయ్‌కుమార్ వనిత అయ్యప్పస్వాములకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సైఫ సురేశ్, చింతల కమలాకర్‌రెడ్డి, దొడ్డ రవీందర్, మాదారపు చంద్రశేఖర్, శ్రీరాం ఈశ్వరయ్య, భూపతి లక్ష్మినారాయణ, రాజశేఖర్, బండారుపల్లి చెంచారావు, పాలకుర్తి శ్రీనివాస్, వజినపల్లి శ్రీణు, శ్రీరాముల శంకరయ్య, దొడ్డ వేణు, మల్యాల రాజు, గురుస్వాములు దేశీరామ్, శ్రీధర్, మర్రి రాజు, తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో రుద్రాభిషేకం



నెక్కొండ : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక రామాలయంలో సోమవారం రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అర్చకుడు బీవీఎస్.శాస్త్రి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. శివ నామ స్మరణతో ఆలయంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. భక్తులు భవానీ పార్వతి పరమేశ్వరులను పూజించి మొక్కులు చెల్లించారు.

పర్వతాల శివాలయానికి రూ.లక్ష విరాళం



పర్వతగిరి : మండల కేంద్రంలోని పర్వతాల శివాలయ అభివృద్ధి కోసం స్థానికుడు గడుదాసు శేఖర్ రూ.లక్ష విరాళం చెక్కును ఆలయ ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి దయాకర్‌రావుకు సోమవారం అందజేశారు. అనంతరం చైర్మన్ దయాకర్‌రావు మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి విరాళం అందజేయడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు, నాయకులు చిదురాల వేణుగోపాల్, రంగు కుమార్ పాల్గొన్నారు.

నియామకం



పర్వతగిరి : తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ కళాకారుల విభాగం మండల కన్వీనర్‌గా పర్వతగిరికి చెందిన బరిగెల విజయ నియమితులయ్యారు. ఈ మేరకు చైర్మన్ చీమ శ్రీనివాస్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర మహిళా కన్వీనర్ జ్యోతిరెడ్డి, కళాకారుల విభాగం కన్వీనర్ ఝెల్ల పోశెట్టి, ప్రధాన కార్యదర్శి పటోళ్ల సురేందర్‌రెడ్డి, ఉత్తర తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ కన్వీనర్ గడ్డం సుధాకర్, ఉమ్మడి జిల్లా కన్వీనర్ రజిత రెడ్డి, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ కార్యకర్తల బహిష్కరణ

నల్లబెల్లి : మండలంలోని నారక్కపేటకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు సూరబోయిన రాంబాబు, అత్తే నవీన్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండడంతో బహిష్కరించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేసే వారికే గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

మొక్కజొన్న సాగులో మాన్యువల్ సీడర్



దుగ్గొండి : వ్యవసాయం నానాటికీ కష్టసాధ్యంగా మారుతోంది. పెట్టుబడి పెరుగుతోంది. కూలీల కొరత, కూలి పెంపుతో అన్నదాతలకు సాగుపట్ల ఆసక్తి తగ్గిపోతోంది. ఈ క్రమంలో కొందరు రైతులు వినూత్నంగా యాంత్రీకరణ దిశగా అడుగులు వేస్తున్నారు. జిల్లాలో పత్తి పంట దెబ్బతినడంతో రబీలో మొక్కజొన్న సాగు చేపట్టిన పరిస్థితి నెలకొంది. ఎకరా మొక్కజొన్న వేయాలంటే నలుగురు కూలీలు అవసరం. కూలీలకే రూ. 2 వేలు వెచ్చించాల్సి వస్తోంది. దీనిని అధిగమించడానికి మార్కెట్‌లోకి వచ్చిన మాన్యువల్ సీడర్ పరికరాన్ని రైతులు ఎంచుకుంటున్నారు. దీంతో రోజుకు మూడు ఎకరాలలో విత్తనాలు వేయొచ్చు. ఒక కూలీతో మూడు ఎకరాల్లో విత్తనాలు సులువుగా వేస్తున్నారు. రూ. 6 వేలు వెచ్చించే బదులు మ్యానువల్ సీడర్‌తో రూ. 800 ఖర్చుతో పూర్తి అవుతుంది.. మాన్యువల్ సీడర్‌తో మొక్కజొన్న వేసే దృశ్యం సోమవారం మండలంలోని నాచినపల్లిలో 'సాక్షి' కెమెరాకు చిక్కింది.

సీఎం బంధువుల కోసమే 'లగచర్ల'

● బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి దయాకర్‌రావు



ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

రాయపర్తి : సీఎం రేవంత్‌రెడ్డి బంధువుల కోసమే కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో గిరిజనుల భూములను లాక్కొని బాధితులపై కేసులు బనాయించారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజమెత్తారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సోమవారం నిర్వహించిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు. సీఎం వియ్యంకునికి, అల్లునికి ఫ్యాక్టరీ కట్టించేందుకే ప్రభుత్వం గిరిజనుల భూములను లాక్కుంటోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఫార్మసీ కంపెనీ కోసం 14 వేల ఎకరాల భూమి తీసుకున్నారని గుర్తు చేశారు. అదలా ఉండగా మళ్లీ గిరిజనుల భూములు లాక్కోవడం దుర్మార్గమన్నారు. మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ మాట్లాడుతూ అరెస్టు చేసిన గిరిజనులను వెంటనే విడుదల చేయడంతోపాటు ఘటనకు బాధ్యులైన వారిని అట్రాసిటి కేసు పెట్టి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహనాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఉపాధ్యక్షుడు నయీమ్, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ ప్రతిపాదన విరమించుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నల్లబెల్లి : ఆదివాసీ, దళిత, గిరిజన, గిరిజనేతర పేదలను నిర్వాసితులుగా మార్చే ప్రమాదం ఉన్న నేపథ్యంలో రంగయ్య చెరువు రిజర్వాయర్ ప్రతిపాదనను విరమించుకోవాలని రంగయ్య చెరువు రిజర్వాయర్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు గూబ రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడారు. రంగయ్య చెరువు, ఎర్రయ్య చెరువులను కలుపుతూ రిజర్వాయర్ నిర్మించాలని 2009లో నాటి ప్రభుత్వం ప్రతిపాదనలు చేసినా ముంపు గ్రామాల ప్రజల నిరసనలతో వెనక్కి తగ్గిందన్నారు. 2014లో రీడిజైన్ చేసి ముంపు సమస్య తలెత్తకుండా దేవాదుల పైపులైన్ ద్వారా రంగయ్య చెరువును గోదావరి జలాలతో నింపి ములుగు, నల్లబెల్లి, నర్సంపేట, ఖానాపూర్, చెన్నారావుపేట, దుగ్గొండి మండలాలకు సాగునీరు అందించినట్టు తెలిపారు. రంగయ్య చెరువు రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టాలని పెండింగ్ ప్రాజెక్టుల సమీక్షా సమావేశంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావడాన్ని తప్పుపట్టారు. అనంతరం తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు పరికి రత్నం, నూనవత్, రాజు, పూల్‌సింగ్, తిరుపతి, బాలు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో మహిళలు కీలకం



చెన్నారావుపేట : మాట్లాడుతున్న తహసీల్దార్

చెన్నారావుపేట : గ్రామాల అభివృద్ధిలో మహిళలు కీలకంగా నిలుస్తున్నారని తహసీల్దార్ ఫణికుమార్, ఏపీఎం ఈశ్వర్ తెలిపారు. మండల కేంద్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కృతజ్ఞత సభకు వారు హాజరై మాట్లాడారు. ఏడాదిలో మహిళ శక్తి ద్వారా 196 యూనిట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో మహిళలకు బ్యాంకుల ద్వారా రూ.26 కోట్ల రుణాలు అందించినట్టు వివరించారు. సభలో ఎంపీవో శ్రీధర్ రాజు, ఏఎస్సై లక్ష్మణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మదర్ తెరిస్సా సమాఖ్య అధ్యక్షురాలు అబ్బరబోయిన నాగమణి, ఏపీఎం తోటకూరి కృష్ణమూర్తి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని మహిళలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. డ్వాక్రా బజార్ ఏర్పాటు, బ్యాంకు లింకేజీ, వడ్డీ లేని రుణాలు, ఎంటర్‌ప్రైజెస్ ఏర్పాటు, తదితరాలపై తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో సీసీలు రమాదేవి, సుధాకర్, కాంతయ్య, రాధిక, అరుణ, లత, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ తర్వాతే నియామకాలు చేపట్టాలి

నల్లబెల్లి : సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ఎస్సీ వర్గీకరణ చేపట్టాకే రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ నాయకుడు మంద కుమార్ కోరారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన మాదిగల ధర్మయుద్ధ మహా సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వర్గీకరణ అమలు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి 11 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి మాదిగలకు తీరని అన్యాయం చేశాడన్నారు. ఇకనైనా కమిటీలు, కమిషన్ల పేరుతో కాలయాపన చేయకుండా వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు.


ఎంఆర్‌పీఎస్ మండల కమిటీ ఎన్నిక

అధ్యక్షుడిగా బొమ్మకంటి అనిల్, గౌరవ అధ్యక్షుడిగా బొట్ల నరేశ్, ప్రధాన కార్యదర్శిగా సత్తి శ్యామ్, ఉపాధ్యక్షులుగా అడ్డ రాజు, గంగారపు అశోక్, పాలేపాక అరుణ్, సూరయ్య ఎన్నికయ్యారు. సమావేశంలో మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ నాయకుడు వేల్పుల వీరన్న, జిల్లా అధ్యక్షుడు కళ్లెపెల్లి ప్రణయ్‌దీప్, నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ పరికి కొర్నేల్, నాయకులు తడుగుల విజయ్, మనుగొండ ప్రసాద్, జన్ను జయరావు, బొట్ల ప్రతాప్, బొట్ల మొగిలి, తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ కమిటీల ఎన్నిక

రాయపర్తి : మండల కేంద్రంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐత రాజు, ఎంఎస్‌పీ పాలకుర్తి నియోజవకర్గ ఇన్‌చార్జ్ కందికట్ల విజయ్ ఆధ్వర్యంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ మండల కమిటీలను సోమవారం ఎన్నుకున్నారు. ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడిగా ఐత జంపి, ప్రధాన కార్యదర్శిగా గారె నరేశ్, ఉపాధ్యక్షుడిగా దాసరి వెంకన్న ఎన్నికయ్యారు. ఎంఎస్‌పీ అధ్యక్షుడిగా వశపాక కుమారస్వామి, ఉపాధ్యక్షుడిగా కందుకూరి మహేందర్, ప్రధాన కార్యదర్శిగా పెండ్లి వరుణ్ ఎన్నికయ్యారు. అనంతరం కమిటీలతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, గారె బాబు, మహేందర్, కిరణ్, అనిల్, ఉపేందర్, రాహుల్, రవి, రాజు, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సర్వే పూర్తి చేయండి



పర్వతగిరి : సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

నర్సంపేట రూరల్ : ఇంటింటి సర్వేను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు కోరారు. మండంలోని మహేశ్వరంలో ఎన్యుమరేటర్లతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫారాలను పూర్తి చేయడంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తప్పులు దొర్లకుండా చూడాలని చెప్పారు.

పర్వతగిరి : మండలంలోని పర్వతగిరి, నారాయణపురం, కల్లెడ గ్రామాల్లో సర్వేను ఎంపీడీఓ శంకర్ నాయక్ పరిశీలించి ఎన్యుమరేటర్లకు సూచనలు చేశారు. ఫారంలో నిర్దేశించిన అన్ని వివరాలు సేకరించాలని సూచించారు. ప్రతి రోజు 15 ఇళ్లను సర్వే చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ సునీల్‌కుమార్, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ రూపేశ్, ఎంపీఓ పాక శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రఘు, ఎన్యుమరేటర్ మాంకాళి రామస్వామి, కారోబార్ కరుణాకర్ పాల్గొన్నారు.

'అభివృద్ధి ఓర్వలేకే ఆరోపణలు'

వర్ధన్నపేట : రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేకే ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఆరోపణలు చేస్తున్నాయని జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్ తెలిపారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మామునూరు ఎయిర్‌పోర్టుకు నిధులు కేటాయించడం అభినందనీయమని తెలిపారు. గత ప్రభుత్వాలు ఎయిర్‌పోర్టు విషయంలో నిర్లక్ష్యం చేశాయని చెప్పారు. వరంగల్‌ను రెండో రాజధానిగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు. సమావేశంలో నాయకులు జనగాం చంద్రమౌళి, చింత బాబు, భాస్కర్, రమేశ్, రాజు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



రాయపర్తి : మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన ఐత మల్లయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి చేయూత ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం రూ.5 వేల 500 సాయం అందజేశారు. తొలుత మల్లయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుమారుడు సంపత్‌ను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు యాకయ్య, ఐత రాజు, ఐత మారుతి, ఐత బాబు, ఐత శ్రీనివాస్, ఐత మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

పంట మాడింది.. పరిహారం ఇప్పించండి

చెన్నారావుపేట : పురుగు మందులు పిచికారీ చేయగా పంట మాడిపోయిందని, తనకు పరిహారం ఇప్పించాలని బాధిత రైతు ప్రభుత్వాన్ని కోరాడు. మండల కేంద్రానికి చెందిన రైతు మంగ శ్రీనివాస్ విలేకరుల ఎదుట సోమవారం గోడు వెళ్లబోసుకున్నారు. తనకున్న అర ఎకరంలో తేజ యశస్విని రకం విత్తనాలతో మిర్చి సాగు చేయగా నల్ల పురుగు, ఆకు ముడత ఉండటంతో, పూత రాలకుండా ఈనెల 13న నర్సంపేటలోని జై కిసాన్ ఫర్టిలైజర్స్ నుంచి కాస్‌కేడ్ 200 మిల్లీలీటర్ల, పోర్టియన్ 100 మిల్లీలీటర్ల, సుమి ఫ్రెంట్ 250 మిల్లీలీటర్ల పురుగు మందులు కొనుగోలు చేసి సదరు షాపు యజమాని సూచించిన విధంగా పిచికారి చేసినట్టు తెలిపారు. తన పంట మాడిపోయిందని వాపోయాడు. మందు పిచికారి చేస్తే పంట ఎండిపోయిందని షాపు యజమానికి చెబితే పట్టించుకోవడం లేదన్నాడు. సుమారు రూ.లక్ష పెట్టుబడి పెట్టగా పంట చేతికందే సమయంలో ఎండిపోతోందని రశీదు చూపిస్తూ విలపించాడు. వ్యవసాయ శాఖ అధికారులు పంటను పరిశీలించి షాపు యజమానిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరాడు.

యూటీఎఫ్ కమిటీ ఎన్నిక

వర్ధన్నపేట : యూటీఎఫ్ మండల కమిటీని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటికాయల కుమార్, సృజన్ ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాబేటి లింగమూర్తి, ప్రధాన కార్యదర్శిగా పార్నంది లలిత్‌కుమార్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, రాజశ్రీ, కోశాధికారిగా నాగరాజు, కార్యదర్శులుగా కనకయ్య, సోమన్న, మురళీధర్, మదన్‌లాల్, జిల్లా డెలిగేట్‌గా రమేశ్‌బాబు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా అనిల్‌కుమార్, అకడమిక్ కమిటీ కన్వీనర్ మహేశ్వర్ నాయక్, కల్చరల్ కమిటీ కన్వీనర్‌గా బొల్లెపెల్లి వీరస్వామి, మండల ఓట్ కమిటీ కన్వీనర్‌గా ఉపేందర్, సోషల్ మీడియా కమిటీ కన్వీనర్‌గా నర్సింగరావు ఎన్నికయ్యారు.

ఎంటర్‌ప్రెన్యూర్‌కు సెర్ప్ సీఈఓ అభినందన

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందకు చెందిన ఎంటర్‌ప్రెన్యూర్ కొంగ రజితను సెర్ప్ సీఈఓ దివ్య అభినందించారు. హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో రజిత ఏర్పాటు చేసిన కంప్యూటర్ ఎంబ్రాయిడరీ వర్క్‌ను సీఈఓ పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. ఎంబ్రాయిడరీ పనిలో నాణ్యత పాటిస్తూ మన్నన పొందడం అభినందనీయమని చెప్పారు.

గంజాయి తరలిస్తున్న బాలుడి రిమాండ్

రాయపర్తి : గంజాయి తరలిస్తున్న బాలుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. వివరాలిలా.. హనుమకొండకు చెందిన ఓ బాలుడు 250 గ్రాముల గంజాయిని వరంగల్ నుంచి తొర్రూరు దిశగా తీసుకెళ్తుండగా విశ్వసనీయ సమాచారం అందడంతో మండలంలోని మైలారం శివారులో అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై చెప్పారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని వస్తువులు దగ్ధం

వర్ధన్నపేట : పట్టణ పరిధిలోని డీసీ తండా శివారులోని గుబ్బడితండాకు చెందిన బానోతు బిక్కు పద్మ దంపతులకు చెందిన ఇంట్లో సోమవారం విద్యుదాఘాతం చోటు చేసుకుని వస్తువులు దగ్ధమయ్యాయి. దంపతులు ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లగా ఇంట్లో నుంచి పొగలు వస్తుండడంతో పక్కింటి వ్యక్తులు సమాచారం అందించడంతో బిక్కు దంపతులు చేరుకుని విద్యుత్ సరఫరా నిలిపివేసి మంటలు ఆర్పారు. కాగా ఇంట్లో ఉన్న దుస్తులు, వంట సామగ్రి, ధాన్యంతోపాటు కొంత నగదు దగ్ధమయ్యాయంటూ బాధితులు కన్నీరు మున్నీరయ్యారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ



వర్ధన్నపేట : తిరుమల తిరుపతి దేవస్థానం ముద్రించిన భగవద్గీత గ్రంథాలను స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడారు. భగవద్గీతలోని 18 అధ్యాయాలను సంక్షిప్తంగా పుస్తక రూపంలో ప్రచురించి పంపిణీ చేయడం అభినందనీయమని తెలిపారు. ఇప్పటి వరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సుమారు 10 వేల మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, నాయకులు రాయపురపు కుమారస్వామి, ఎద్దు సత్యనారాయణ, పోశాల వెంకన్న, మోడెం కుమారస్వామి, చోటూ, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

● టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రంజిత్‌రెడ్డి

నెక్కొండ : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డితో కలిసి రంజిత్‌రెడ్డి సోమవారం ప్రారంభించి మాట్లాడారు. తూకం, కోతల పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని కోరారు. సన్న రకం ధాన్యానికి మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ లభిస్తుందని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రావుల మహిపాల్‌రెడ్డి, మహ్మద్ ఖలీల్, తాళ్లూరి నర్సింహస్వామి, దొడ్డ విజయ్‌కుమార్, బొమ్మెరబోయిన రమేశ్, మార్కెట్ కార్యదర్శి కృష్ణ మీనన్, మండల సమాఖ్య అధ్యక్షురాలు మార్త లావణ్య, వీఓ అధ్యక్షురాలు రాసమల్ల శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



నర్సంపేట : విద్యార్థులతో చైర్మన్ సుబ్బారావు, ఉపాధ్యాయులు

నర్సంపేట : మానుకోట కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పోటీల్లో నర్సంపేటకు చెందిన గీతాంజలి డీజీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటినట్టు గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ ఆవరణలో ప్రతిభ చాటిన విద్యార్థులను సోమవారం చైర్మన్ సుబ్బారావు, కరాటే మాస్టర్ వెంకన్న అభినందించారు. అనంతరం చైర్మన్ మాట్లాడారు. విద్యార్థులు సాయి మన్విత, సంకీర్తన ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించగా శ్రీవర్షిత ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ దక్కించుకుందని చెప్పారు. అశ్విత తేజ్, స్నేహిత, భవిత మూడో స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించారని వివరించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ప్రవీణ్, ఉపాధ్యాయులు రాజేందర్, మహేశ్, గణేశ్, పీఈటీలు అజయ్, వసుంధర పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలల (బిట్స్) విద్యార్థులు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 90 సంవత్సరాల ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హరిహరన్ మాట్లాడారు. పోటీలో సుమారు 9 వేల మంది విద్యార్థులు పాల్గొనగా బిట్స్ నుంచి రెండు జట్లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. విద్యార్థులను బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ నారాయణ, ఫణీంద్ర, ఏఓ సురేశ్, ఈసీఈ విభాగాధిపతి కిరణ్, ట్రిపుల్ ఈ విభాగాధిపతి మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.



చెన్నారావుపేట : విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం జయ, ఉపాధ్యాయులు

చిత్రలేఖనం, ఉపన్యాస పోటీల్లో..

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు చిత్రలేఖనం, ఉపన్యాస పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో బహుమతులు సాధించినట్లు హెచ్‌ఎం జయ తెలిపారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులను సోమవారం ఆమె అభినందించి మాట్లాడారు. దీవెన ట్రస్ట్ ఆధ్వర్యంలో 'మత్తు పదార్థాల వినియోగం-అనర్థాలు'పై నిర్వహించిన ఉపన్యాసం పోటీలో శ్రీజ జిల్లా ప్రథమ బహుమతి అందుకుందని చెప్పారు. ఫిజికల్ సైన్స్ టీచర్ పిన్నింటి బాలాజీరావు గైడ్ టీచర్‌గా వ్యవహరించినట్టు తెలిపారు. చిత్రలేఖనంలో కల్యాణ్ కృష్ణ జిల్లా ద్వితీయ బహుమతిని విద్యార్థి గెల్చుకోగా ఆయనకు గైడ్ టీచర్‌గా బయాలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు సుందర్ వ్యవహరించినట్టు వివరించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు వెంగల మురళి ఫలితాలను ప్రకటించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, రాగి శశిధర్, సంతోశ్‌కుమార్, ఉదయ్‌కుమార్, మాధవి, మొగిలి, మాధవి, వర్దెల్లి సతీశ్‌కుమార్, రమాదేవి, వీరగోని స్వప్న, హంస రామకృష్ణ, జాహెద్, చింతకింది ఇందిర తదితరులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తి సాగు మేలు

● కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సౌమ్య

గీసుకొండ : రైతులు అధిక సాంద్రత కలిగిన పత్తి సాగు చేయడం మేలని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య తెలిపారు. మండలంలోని అనంతారంలో రైతు గద్దె రామారావు పత్తి క్షేత్రంలో సోమవారం నిర్వహించిన క్షేత్రస్థాయి దినోత్సవ సమావేశంలో ఆమె మాట్లాడారు. అధిక సాంద్రత కలిగిన పత్తి సాగులో కూలీల ఖర్చు, పంట కాలం తగ్గుతాయని చెప్పారు. పత్తి తర్వాత ఇతర పంటలు సాగు చేసి రబీలో అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఏఓ హరిప్రసాద్ బాబు మాట్లాడుతూ అధిక సాంద్రత పత్తి సాగు చేస్తే గులాబీ పురుగు ఉధృతి నుంచి పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. సమావేశంలో నూజివీడు విత్తన సంస్థ ఏరియా సేల్స్ మేనేజర్ మురళీమోహన్, డిస్ట్రిబ్యూటర్ రాంచంద్రారెడ్డి, సేల్స్ ఆఫీసర్ నాగరాజు, కేవీకే యంగ్ ప్రొఫెషనల్ హర్షరెడ్డి, సాయిచంద్ తదితరులు పాల్గొన్నారు.

'వర్గీకరణ పేరుతో కలహాలు సరికాదు'

దుగ్గొండి : ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల్లో కలహాలు సరికాదని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ కడారి కుమార్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన మాలమహానాడు మండల కార్యకర్తల సమావేశానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని చెప్పారు. దళితుల మధ్య విద్వేషాలు సృష్టిస్తూ మాల, మాదిగ కులస్తులను విడగొట్టడానికి కుట్ర పన్నుతున్నారని ధ్వజమెత్తారు. అనంతరం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యవర్గానికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సాదు నర్సింగరావు, ఉసిల్ల దయాకర్, కోడి కృష్ణాకర్, గురిమిల్ల దేవేందర్, కోతి విష్ణు, పత్రి కుమార్, అశోద నర్సింగం, పత్రి అశోక్, ఈద విజేందర్, సుదర్శన్, గురిమిల్ల రవి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అభయహస్తం అమలు చేయాలి

దుగ్గొండి : ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో అంబేడ్కర్ అభయహస్తం పథకాన్ని రూపొందించి అమలు చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు నమిండ్ల క్లైమెంట్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని నివాసంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేసింది. అనంతరం క్లైమెంట్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా అంబేడ్కర్ అభయహస్తం పథకం అమలు చేయకపోవడం సరికాదన్నారు. ఇకనైనా వెంటనే పథకాన్ని అమలు చేస్తూ పేద దళితులందరికీ రూ.12 లక్షలు చొప్పున ఆర్థికసాయం అందజేయాలని, ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు నల్ల బాబురావు, నాయకులు ఆకులపెల్లి ఉప్పలయ్య, గూడెల్లి రవి, పులి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.